క్లుప్తంగా

వంటగదిలో కనిపించిన జింకపిల్ల



వంటగదిలో తిరుగాడుతున్న జింకపిల్ల

సీతానగరం: కొండల్లో నివాసం ఉండవలసిన అడవి జంతువు జింక పిల్ల వంటింటి గదిలో చొరబడడంతో గ్రామస్తులు చూడ్డానికి ఎగబడ్డారు. సీతానగరం మండలంలోని పెదభోగిలి హడ్కో కాలనీలో బుధవారం ఉదయం మహిళలంతా ఇంటి పనుల్లో నిమగ్నమైన సమయంలో ఒక వంటింట్లో జింకపిల్ల వచ్చి కంచాలు చప్పుడు చేయడంతో మహిళలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొంతమంది వంటింట్లోకి వెళ్లి చూసి జింకపిల్లగా గుర్తించి ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తహసీల్దార్ ఎన్వీరమణ, పార్వతీపురం అటవీశాఖ అధికారులకు ఇచ్చిన సమాచారం మేరకు జింకపిల్లను సమీపంలో ఉన్న కొండలో విడిచి పెడతామన్నారు.

చెక్‌పోస్టుల పరిశీలన



పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద సిబ్బంది సూచనలు చేస్తున్న సీఐ ధనుంజయ రావు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస, ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన పద్మాపురం చెక్‌పోస్టులను సాలూరు రూరల్ సీఐ ధనుంజయ రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పహారా కాస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. సారా,గంజాయి వంటి మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా పటిష్ట బందోబస్తుతో నూతన చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీ చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ఎస్సై నారాయణరావు ఉన్నారు.

వెంగాపురంలో నగరసంకీర్తన



బలిజిపేట: నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

బలిజిపేట: ధనుర్మాస సందర్భంగా బలిజిపేట మండలంలోని వెంగాపురంలో భక్తులు గోవింద నామస్మరణతో నగర సంకీర్తన నిత్యం చేస్తున్నారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి గోదాదేవి కల్యాణం వరకు నగర సంకీర్తన, రామాలయంలో ప్రత్యేక పూజలు, విశేష పూజలు నిర్వహిస్తామని అర్చకుడు కె.గోపాల కృష్ణ తెలిపారు. భక్తులు స్వామివారికి ప్రసాద భోగాలను మొక్కులుగా చెల్లించడం, విశేష రోజుల్లో పూలను సమర్పించి స్వామివారికి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 5గంటల నుంచి 6గంటల వరకు స్వామివారిని గోవింద నామాలతో నగర సంకీర్తన నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజారోగ్యానికి అగ్రతాంబూలం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి అగ్రతాంబూలం వేశారని మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడులు అన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని కోటవీధి సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష 2.0 కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఆరోగ్యసురక్ష వైద్యశిబిరానికి వస్తున్న రోగులు వారికి అందిస్తున్న చికిత్స, ఏర్పాట్లపై ఆరాతీశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు ,వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన సీఐ



ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను కలిసిన సీఐ దేముడుబాబు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొరను సాలూరు పట్టణ సీఐ జి.దేముడుబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఉపముఖ్యమంత్రిని ఆయన స్వగృహంలో కలవగా శాంతిభద్రతలపై ఇద్దరూ చర్చించారు. ఆయన విశాఖపట్నం సిటీ నుంచి బదిలీపై సాలూరు సీఐగా వచ్చారు.

ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యమంత్రి ధ్యేయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- జిల్లాకేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల జగన్నాథపురం యూపీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందన్నారు. రాష్ట్రస్థాయిలో రూ.1.60 కోట్ల పైచిలుకు ప్రజలు ఆ కార్యక్రమాన్ని వినియోగించుకోగా పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో సుమారు 64 వేల మంది వినియోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు ఎంతగానో అవసరమని గుర్తించిన సీఎం జగన్ ఈ గొప్ప కార్యక్రమాన్ని కొనసాగిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష -2ను మళ్లీ ప్రారంభించి అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలన్న సదుద్దేశంతో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, డీఎంహెచ్ఓ జగన్నాథరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు, నాయకులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ఉండాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల 8వ బూత్ నుంచి 42వ పోలింగ్ బూత్ వరకు గల బూత్‌స్థాయి కమిటీలు ఏర్పాటు చేయడంలో భాగంగా ఆయా పోలింగ్ స్టేషన్ పరిధిలో గల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలసి కొత్తవలస ఫంక్షన్ హాల్‌లో సమావేశమై బూత్ కమిటీలు ఏర్పాటు చేసి వారికి బూత్ స్థాయిలో ఎలా పనిచేయాలన్న అంశంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లె మాధవరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, వార్డు కౌన్సిలర్‌లు సంఘం రెడ్డి లక్ష్మీ పార్వతి, చీకటి అనూరాధ, సువ్వాడ లావణ్య, పి.జయంతి, బి.కృపాబాయి, బొత్స ఆనంద్, ఆర్. చిన్నంనాయుడు, జి.బాలమురళీకృష్ణ, తాడ్డి శంకరరావు, కోఆప్షన్ సభ్యుడు మేరువ వెంకట్రావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి జగనన్న సువర్ణయుగ పాలన

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా కన్వీనర్‌లు, కో కన్వీనర్లతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిల సువర్ణయుగపాలనను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. బుధవారం పట్టణంలోని తన గృహంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌లు, కో కన్వీనర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు.ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు

- ఆర్డీఓ కె.హేమలత



సీతానగరంలో రేషన్ సరుకులను పరిశీలిస్తున్న ఆర్డీఓ కె.హేమలత

సీతానగరం: పండించిన ధాన్యాన్నంతటినీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని పార్వతీపురం ఆర్డీఓ కె.హేమలత అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె సీతానగరం మండలంలోని బూర్జ రైస్‌మిల్లులో ఇంతవరకూ కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలు, తయారుచేస్తున్న బియ్యం నిలవలు, బ్యాంక్ గ్యారెంటీల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించి కళ్లాల్లో నూర్పు చేసిన ధాన్యం , ఇంతవరకూ మిల్లులకు తరలించిన ధాన్యం వివరాల నివేదిక పంపించాలని తహసీల్దార్ ఎన్వీ రమణను ఆదేశించామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల బ్యాంక్ ఖాతాలకు డబ్బు జమ కానున్నట్లు చెప్పారు. ఇంతవరకూ సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించడంలో జాప్యం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే మిల్లుల్లో ధాన్యం నిల్వలపై తహసీల్దార్ ఎప్పటికప్పుడు వీఆర్వోల ద్వారా నివేదికలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం ధాన్యం కొనుగోలు, తరలింపు, ప్రభుత్వం బిల్లులు చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు రైతులు మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన 36 గంటల్లో తమ బ్యాంక్ ఖాతాలకు బిల్లులు జమవుతున్నాయని చెప్పారు.

రేషన్ సరుకులు నిర్దేశిత సమయానికి పంపిణీ చేయాలి

వ్యవసాయ పనుల్లో నిమగ్న మైన రేషన్ వినియోగదారులకు నిర్దేశించిన గడువులోగా, వారికి వెసులుబాటు ఉన్నసమయంలో నిత్యావసర సరుకులు ఇళ్ల వద్దకు వాహనాలతో వెళ్లి పంపిణీ చేయాలని ఆర్డీఓ కె.హేమలత ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండలకేంద్రంలో రేషన్ సరుకుల కోసం వచ్చిన వారితో రేషన్‌పంపిణీ వాహనం వద్ద మాట్లాడారు.ప్రతినెలా ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యంతోపాటు రాయితీపై 1 కేజీ కందిపప్పు, పంచదార, గోదుమ పిండి ఇళ్ల వద్దనే ఇస్తున్నారని లబ్ధిదారులు తెలియజేశారు. రేషన్ సరుకుల పంపిణీపై ఎటువంటి సమస్య వచ్చినా తహసీల్దార్ ఎన్వీ రమణకు తెలియ జేయాలని లబ్ధిదారులకు ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీ రమణ, ఆర్ఐ ఎన్ శ్రీనివాసరావు, వీఆర్వోలు దామోదర నాయుడు, కుమారస్వామి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓ సామల సింహాచలాన్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



బలిజిపేట: అరసాడ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ సామల

బలిజిపేట: మండలంలోని 1998ఉపాధ్యాయులు ఎంఈఓ-1సామల సింహాచలాన్ని బుధవారం సన్మానించారు. ఇటీవల ఎంఈఓ-1ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన ఎన్నికైన సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సామల సింహాచలం మాట్లాడుతూ 1998ఉపాధ్యాయులు వృత్తిపరంగా మంచి పేరుప్రతిష్టలు సంపాదించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేయాలని కోరారు. మంచి విద్యను అందించి విద్యార్థుల భవిషత్ తీర్చి దిద్దాలని చెప్పారు. వృత్తిలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యాలయం పరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా తాను సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే తనకు తెలియపరచాలని పిలుపునిచ్చారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి

బలిజిపేట: పదవ తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఎంఈఓ-1సామల సింహాచలం పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అరసాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో అనుసరించాల్సిన విధి విధానాలను వారికి సూచించారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై దృష్టిసారించి మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. వారికి ప్రత్యేక తరగతుల ద్వారా వెనుకబడిన సబ్జెక్టులను బోధించి నిష్ణాతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు. సబ్జెక్టు పరంగా ఎటువంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని ఆ శాఖ అధికారి సుధాకర్‌రావు అన్నారు.అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్యాస్,విద్యుత్ తదితర కారణాలతో అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలనే ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, సీతారాం, నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రబీసీజన్ పంట నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఏఓ రాబర్ట్‌పాల్

సీతానగరం: నీటివనరులున్న ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె. రాబర్ట్‌పాల్ కోరారు. ఈ మేరకు సీతానగరం మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ 2023లో సాగవుతున్న మినుము, పెసర, మొక్కజొన్న పంటల నమోదు త్వరితగతిన చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. జిల్లాలో గల 15 మండలాల్లో ఇప్పటివరకు 1,29,012 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా జిల్లాలో మొత్తం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతోందన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ

పాలకొండ: రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో రేషన్ బియ్యం పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు. రేషన్ పంపిణీ తీరుపై కార్డుదారుల వద్ద ఆరాతీశారు. బియ్యం పంపిణీలో ఎక్కడ లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వీఆర్వో శ్రీనివాసరావును ఆదేశించారు.

సరిహద్దులో అప్రమత్తం



భామిని చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న సీఐ చంద్రమౌళి

భామిని: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా-ఒడిస్సా సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి సిబ్బందికి సూచించారు. బత్తిలి ఎస్సై చిట్టిపూలు ప్రసాద్‌తో కలిసి బత్తిలి, భామిని సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను బుధవారం తనిఖీ చేశారు. ఒడిస్సా నుంచి వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మద్యం, నిషేధిత పదార్థాల తరలింపుపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని పలు వివాదస్పద గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు.

విద్యార్థులకు పీఓ అభినందనలు



క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఇటీవల పి.కోనవలసలో జరిగిన రాష్ట్ర స్థాయి గిరిజన గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గిరిజన విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. వీరిని బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అభినందించారు. స్థానిక బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు కబడ్డీలో విన్నర్స్ గాను, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో రన్నర్స్‌గా నిలిచారు. ఎస్.శ్రీజ అనే విద్యార్థిని, 800, 200ల మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచారు. బాలుర కళాశాల విద్యార్థులు ఖోఖో, ఆర్చరీలో ప్రథమ స్థానం నిలిచారు. ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానంతో పాటు ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్ సాధించారు. బాలికల పాఠశాల విద్యార్థినులు కబడ్డీ ప్రథమం, ఖోఖోలో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్, షాట్‌పుట్, పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, ప్రిన్సిపాళ్లు పైడి నాగభూషణరావు, పి.సూర్యకుమారి, పీడీ లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి



బలిజిపేట: పలగర ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

బలిజిపేట: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని బలిజిపేట మండలంలోని పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాఠశాలల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆమె తొలి మహిళా ఉపాధ్యాయురాలే కాకుండా రచయిత్రి, మంచి సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆమె ఉపాధ్యాయ వృత్తి పరంగా ఎన్నో సేవలు అందించారని తెలిపారు. అనంతరం పలుపాఠశాలల్లో ఉపాధ్యాయినులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేఏఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్, నోడల్ అధికారి డాక్టర్ రమేష్



జేఏఎస్-2 శిబిరంలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్, నోడల్ అధికారి డాక్టర్ రమేష్

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్, నోడల్ అధికారి డాక్టర్ రమేష్ కోరారు. పార్వతీపురం పట్టణంలోని జగన్నాథపురంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. వైద్య శిబిరంలో అన్ని విభాగాలను పరిశీలించారు. అన్ని మందులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్పెషలిస్టు డాక్టర్లు, ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి 6నెలలకు ఒకసారి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. జిల్లాలో నెలకు 72 శిబిరాలు జరుగుతాయని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులను కేంద్ర డ్రగ్ స్టోర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయానికి పంపించి అక్కడి నుండి బాధితుడికి అందజేస్తారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మంగళ, శుక్రవారాలు మండలాల్లోను ప్రతి బుధవారం పట్టణ ప్రాంతాల్లోను వైద్య శిబిరాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంచన్‌గా పింఛన్ పంపిణీ

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ పింఛన్ కానుకను పార్వతీపురం పట్టణంలోని లబ్దిదారులకు వలంటీర్లు, గృహసారథులు బుధవారం సాయంత్రం అందజేశారు.



పార్వతీపురం టౌన్: 14వ వార్డులో లబ్ధిదారు కొల్లి కృష్ణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోతి



పార్వతీపురం టౌన్: 19వ వార్డులో లబ్ధిదారు ఆర్. బంగారుశెట్టికు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాంబాబు



పార్వతీపురం టౌన్: 13వ వార్డు లబ్ధిదారు చింత రామకృష్ణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రజని



పార్వతీపురం టౌన్: 4వ వార్డుకు చెందిన లబ్ధిదారు నూకమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సింహాచలం

గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణకు
కార్యదర్శులు దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్యసురక్ష-2 వైద్య శిబిరాలను పంచాయతీ కార్యదర్శులు విజయవంతం చేయాలని, ప్రజల ఆరోగ్య రక్షణకు అంకిత భావంతో పని చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన వివిధ అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ రెండవ విడత జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరాల నిర్వహణ, ఆడుదాం ఆంధ్రా, వికసిత్ భారత్ కార్యక్రమాలపై మాట్లాడారు. అలాగే ప్రభుత్వం కొత్తగా పెంచిన పెన్షన్ సొమ్ము ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.